



ఓర్వకల్లుకు పారిశ్రామిక వైభవం

కర్నూలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ 2024-25 రాష్ట్రానికి వరాల జల్లు కురిపించింది. ఓర్వకల్లు పారిశ్రామిక వైభవంతో వెలిగిపోయేలా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నిధులు కేటాయించారు. మంగళవారం పార్లమెంట్‌లో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీని కానుకగా ఇచ్చారు. గత జగన్ ప్రభుత్వంలో రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టులు రాకపోగా ఉన్నవి కూడా వెనక్కిపోయాయి. బడ్జెట్ కేటాయింపులు జరగలేదు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి తీవ్రంగా నష్టపోయింది. వివిధ ప్రభుత్వ రంగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ తరుణంలో కొలువుదీరిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వ సారథి సీఎం చంద్రబాబు పలుమార్లు డిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, హోం శాఖ మంత్రి అమిత్‌షా సహా పలువురు మంత్రులను కలసి చర్చించారు. దీని ఫలితమే నిర్మలా సీతారామన్ బడ్జెట్ పద్దుల్లో రాష్ట్రానికి ప్రాధాన్యత దక్కింది. అమరావతి, పోలవరం ప్రాజెక్టు సహా ఓర్వకల్లును పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. నీరు, విద్యుత్, రోడ్లు, రైల్వేల వంటి మౌలిక వసతులకు నిధులు ఇస్తామన్నారు.

పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట

- టీజీ భరత్, పరిశ్రమల శాఖ మంత్రి



రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ కేటాయింపులు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం వల్ల రాష్ట్రం పారిశ్రామికంగా పాతికేళ్లు వెనక్కి వెళ్లింది. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు అగ్రస్థానం కల్పించింది. అదే క్రమంలో ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాల నిధులు ఇవ్వడం అభినందనీయం. కేంద్ర నిధులు పూర్తిగా సద్వినియోగం చేసుకుని పరిశ్రమల శాఖ మంత్రిగా ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్‌ను అభివృద్ధి చేస్తా. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కేంద్రం పలు ప్రాజెక్టులు ఇవ్వాలి. అప్పుడే ఏపీ గణనీయమైన పురోగతి సాధిస్తుంది.

ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధికి బీజం

వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక గ్రాంట్లు ఇవ్వాలని రాష్ట్ర విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. 2014 తరువాత మూడేళ్లు కేంద్రం దాదాపు రూ.300 కోట్లు ఇచ్చింది. ఆ తరువాత ఒక్కపైసా కూడా ఇవ్వలేదు. గత వైసీపీ ప్రభుత్వం ఆ నిధుల కోసం కనీస ప్రయత్నం చేసినట్లు కూడా కనిపించలేదు. దీంతో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు పలుమార్లు డిల్లీ వెళ్లి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలంటే కేంద్ర సహకారం కావాలని ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. దీని ఫలితంగా రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక గ్రాంటు ఇస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. దీంతో వెనుకబడిన ప్రాంతాల ప్రగతిపై ఆశలు చిగురించాయి.




చంద్రబాబు హయాంలో నిర్మించిన ఓర్వకల్లు విమానాశ్రయం

సాధారణ ఎన్నికల తర్వాత మొదటిసారి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు, రాష్ట్రానికి ఆశలు కలిగించేలా ఉంది. ఓర్వకల్లు పారిశ్రామివాడలో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా మౌలిక వసతుల ఏర్పాటుకు నిధులు వెచ్చిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్-2024-25లో వెల్లడించారు. రాష్ట్ర విభజన తరువాత ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు 33 వేల ఎకరాల్లో ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌కు శ్రీకారం చుట్టారు. ఆసియాలోనే అదిపెద్ద వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ యూనిట్ ఏర్పాటు చేశారు. జైరాజ్ ఇస్పాత్ ఐరన్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. కేంద్ర రక్షణ శాఖ ఆయుధ తయారీ పరిశ్రమ (డీఆర్‌డీఓ) తెచ్చారు. ప్రపంచంలోనే తొలి పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు నాంది పలికారు. కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం నిర్మించారు. 2019లో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వంలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పడకేసింది. తాజాగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ అది జీవం పోసుకుంది. హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో నీరు, విద్యుత్తు, రైల్వే, రోడ్లు వంటి మౌలిక వసతులకు నిధులు ఇస్తామని, ఆర్థికవృద్ధి, పెట్టుబడులకు మూలధనం ఈ ఏడాదే అదనపు కేటాయింపులు చేస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే పారిశ్రామిక అవసరాల కోసం ఓర్వకల్లు మండలంలో 4 టీఎంసీల సామర్థ్యంతో జలాశయం నిర్మించి ముచ్చుమర్రి నుంచి ఎత్తిపోయాలని, కర్నూలు మండలం దూపాడు నుంచి ఓర్వకల్లుకు రైల్వే లైన్ నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. రైల్వే లైన్ నంద్యాలకు పొడిగిస్తే కర్నూలు-విజయవాడ వయా నంద్యాల మీదుగా రైళ్లు కూడా నడపవచ్చు. పదేళ్ల కింద చంద్రబాబు ఆలోచనల నుంచి పురుడుపోసుకున్న ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పనులు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటనతో ముందుకు పోవడానికి అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

- రోడ్లు, నీరు, విద్యుత్, రైల్వే వంటి మౌలిక వసతులకు నిధులు
- పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేసిన కేంద్ర బడ్జెట్
- వెనుకబడిన సీమ జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ
- బడ్జెట్‌లో వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

కరువు ప్రాంతం అభివృద్ధికి జీవం



రాజధాని అమరావతి, ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు, జిల్లాలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ సహా వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఆ సమయంలో పార్లమెంట్‌లో నేను కూడా ఉండడం మరవలేని ఆనందం. కర్నూలు ఎంపీగా ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వానికి జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

- బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎంపీ

చంద్రబాబు విజన్ ఇలా ఉంటుంది



చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన 45 రోజులకే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల వరద మొదలైంది. కేంద్ర బడ్జెట్‌లో రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడమే కాకుండా పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇస్తామని మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఓర్వకల్లు పారిశ్రామి హబ్‌లో మౌలిక వసతులకు నిధులు ఇస్తామని, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించడం అభినందనీయం. చంద్రబాబు విజన్ ఇలా ఉంటుందని. జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్క పైసా రాబట్టలేకపోయారు.

- సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దపీట



సీఎం చంద్రబాబు పలుమార్లు డిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, మంత్రులను కలసి గత జగన్ ప్రభుత్వం సాగించిన విధ్వంస పాలన వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఏ స్థాయిలో నష్టపోయిందో వివరించారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కేంద్ర సహకారం కావాలని ప్రధాని మోదీని ఒప్పించారు. ఆయన విజన్ వల్లనే కేంద్ర బడ్జెట్‌లో మన రాష్ట్రానికి పెద్దపీట దక్కింది. గతంలో జగన్ కేసుల మాఫీ కోసం ఢిల్లీకి వెళితే... చంద్రబాబు ప్రగతి కోసం వెళ్లి నిధులు రాబట్టారు. జిల్లాలో ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌లో మౌలిక వసతులతో పాటు వెనుకబడిన ప్రాంతాల గ్రాంటు ద్వారా పశ్చిమ ప్రాంతంలో అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి.

- బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే

అభివృద్ధిలో పరుగులు



నంద్యాల కల్చరల్: మంగళవారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. అమరావతి నిర్మాణానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.15వేల కోట్లు, పోలవరం నిర్మాణం త్వరగా పూర్తి కావడానికి నిధులు, ఓర్వకల్లు పారిశ్రామిక అభివృద్ధికి నిధులు కేటాయించడం సంతోషకరం. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.620 కోట్లు కేటాయించడంతో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుంది. బడ్జెట్‌లో నిధులు కేటాయించి రాష్ట్రానికి బీజేపీ ఎంతో మేలు చేకూర్చింది.

- అభిరుచి మధు, నంద్యాల జిల్లా కోఆర్డినేటర్, బీజేపీ

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యం



నంద్యాల నూనెపల్లె: కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి నిధులు కేటాయించే విషయంలో చంద్రబాబు చొరవ అమోఘమని రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి న్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర అవసరాలను గుర్తించి రాజధాని, పోలవరం, పారిశ్రామిక రంగాలపై దృష్టి సారించినందుకు ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలసీతారామన్‌కు ధన్యవాదాలు. అంతే కాకుండా వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నుంచి వచ్చే సహకారం రాష్ట్ర పునర్నిర్మాణానికి దోహదపడుతుంది.

- ఫరూక్, మైనార్టీ శాఖ మంత్రి

రాష్ట్రానికి సముచిత స్థానం కల్పించారు



జగన్ పాలనతో ప్రజాస్వామ్య వ్యవస్థలు పతనావస్థకు చేరాయి. చంద్రబాబు విన్నపాన్ని ఆలకించిన కేంద్ర పెద్దలు అమరావతి, పోలవరం, ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ మౌలిక సదుపాయాల కోసం నిధులు ప్రకటించడం సంతోషదాయకం. వెనుబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఇస్తామని చెప్పడం జిల్లాలోని కరువు పల్లెలు ఊపిరి పీల్చుకునే అవకాశం కలిగింది

- తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతులు స్వీకరించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల



వినతులు స్వీకరిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల

డోన్, జూలై 23: క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం అమరావతిలోని మంగళగిరిలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను వింటూ వారి నుంచి వినతులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ప్రజలు సమర్పించిన వినతులపై అధికారులతో ఎమ్మెల్యే కోట్ల మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి వచ్చిన సమస్యలను సీఎం చంద్రబాబుతో పాటు ఆయా శాఖల మంత్రుల దృష్టికి తీసుకెళ్లతానని అన్నారు. నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేయాలని వివిధ నియోజకవర్గాల పార్టీ నాయకులు వినతులు ఇచ్చారని, వాటిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు.

మహానందీశ్వరుడి హుండీ ఆదాయం రూ.అరకోటి



మహానందిలో హుండీ ఆదాయం లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి

మహానంది, జూలై 23: మహానంది క్షేత్రంలో మంగళవారం స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 54 రోజులకు గాను ఆలయానికి రూ.50.11 లక్షల మేర ఆదాయం సమకూరింది. ఆలయ ప్రాంగణంలోని అభిషేక మండపంలో భక్తులు ప్రధాన ఆలయాల్లోని హుండీల్లో వేసిన కానుకలను సిబ్బంది సహాయంతో లెక్కింపు జరుపగా రూ.48,73,743, అలాగే అన్న ప్రసాదం హుండీ ద్వారా రూ1,18,327, గోవు సంరక్షణ హుండీ ద్వారా రూ.19,031 ఆదాయం వచ్చింది. వీటితో పాటు 12 యూఎస్ డాలర్లు వచ్చినట్లు ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేపడతాం

అసెంబ్లీలో ప్రస్తావించిన మంత్రి బీసీ



బనగానపల్లె, జూలై 23: రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన నేషనల్ హైవే, రాష్ట్ర రోడ్ల నిర్మాణంలో అవినీతికి పాల్పడ్డ ఏజెన్సీ, కాంట్రాక్టర్లపై విచారణ చేపడతామని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమాధానమిస్తూ ప్రజాధనంతో నిర్మించిన రోడ్లు గత వైసీపీ ప్రభుత్వ హయంలో నాసిరకంగా నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణం పనుల్లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించి మూడు నెలల్లో నివేదిక తెప్పించుకొని చర్యలు తీసుకుంటామన్నారు. గత వైసీపీ పాలనలో రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. తమ ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతోందన్నారు. వర్షాకాలం పూర్తయిన వెంటనే రహదారుల పనులు చేపడతామని మంత్రి బీసీ హామీనిచ్చారు.

మహానంది ఆలయంలో బదిలీలు

మహానంది, జూలై 23: మహానంది క్షేత్రంలో అంతర్గత బదిలీల్లో స్వల్పమార్పులు చేసినట్లు ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జునయ్యను టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా మార్పు చేశారు. జూనియర్ అసిస్టెంట్ రాచమల్ల శ్రీనివాసులును అన్నదానం విభాగానికి, జూనియర్ అసిస్టెంట్ హరినాథ్‌ను ఇంజనీరింగ్ విభాగానికి, అక్కడ పనిచేస్తున్న అధికారి శ్రీనివాసులు యాదవ్‌ను ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానానికి డిప్యుటేషన్‌పై పంపారు.

నందీశ్వరుడికి విశేష పూజలు



నందీశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలం, జూలై 23: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు, అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి స్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళ హారతులు సమర్పించారు.

ఆకట్టుకున్న నిత్యకళారాధన: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో మంగళవారం కర్నూలుకు చెందిన సూర్యకళా కల్చరల్ అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గజవదన, ఓం నమఃశివాయా, ఓంకార రూపిణి, భో శంభో తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

ఆధార్ కేంద్రాల ప్రారంభం

నంద్యాల రూరల్, జూలై 23: ఆధార్ ఆపరేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆధార్ నమోదు కేంద్రాలను ఎంపీడీవో సౌభాగ్యమ్మ మంగళవారం ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహించే ఆధార్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

'దివ్యాంగులకు పరికరాలు అందజేస్తాం'

నంద్యాల రూరల్, జూలై 23: దివ్యాంగులందరికీ పరికరాలు అందజేస్తామని జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం ఫిజియోథెరపిస్టు అరుణసుష్మా తెలిపారు. నంద్యాల మండలంలోని బిల్లలాపురం గ్రామంలో మంగళవారం జిల్లా దివ్యాంగుల రిహాబిలిటేషన్ సెంటర్ ప్రాజెక్ట్ మేనేజర్ ఇస్మాయిల్ ఆదేశాల మేరకు దివ్యాంగుల గుర్తింపు సర్వే నిర్వహించారు. స్పెషల్ ఎడ్యుకేటర్ శ్రావణిరెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు, దివ్యాంగుల హక్కుల అసోసియేషన్ వ్యవస్థాపకుడు మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

'పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలి'

పగిడ్యాల, జూలై 23: ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లోని రైతుల పొలాలల్లో పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఉపాధిహామీ పథకం అంబుడ్స్ పర్సన్ సురేంద్ర సూచించారు. పగిడ్యాలలోని ఉపాధి కార్యాలయంలో ఎంపీడీవో కవిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పండ్ల తోటల పెంపకం పై రైతులకు అవగాహన కల్పించి ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పగిడ్యాల సమీపంలో రైతులు సాగుచేసిన పండ్ల తోటలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో మద్దిలేటి, ఈవోఆర్డీ నాగేంద్రమయ్య, ఈసీ ఆశోక్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఆజాద్, తిలక్ జయంతి

పగిడ్యాల, జూలై 23: మండలంలోని ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకుల ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర తిలక్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం కౌసల్యబాయి, ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు ఉన్నారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

కొత్తపల్లి, జూలై 23: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు దిగువనున్న ప్రాజెక్టులకు భారీ ఎత్తున వరద నీరు వస్తున్న నేపథ్యంలో కృష్ణానది తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపల్లి తహసీల్దార్ తిరుపతయ్య సూచించారు. మంగళవారం ఆయన డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్నతో పాటు సీనియర్ అసిస్టెంట్ సుందర్‌రాజు, సిబ్బందితో కలిసి సంగమేశ్వరం వస్తున్న వరద నీటిని పరిశీలించారు. దీంతో ముందుగా సంగమేశ్వరంలోని స్వామివారిని దర్శించుకున్న అనంతరం కృష్ణానదికి వస్తున్న వరద నీటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు నుంచి ఎగువన 1.50 లక్షల క్యూసెక్కులకు పైగా శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద నీరు వస్తుందని, నది తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

వెలుగోడు, జూలై 23: వెలుగోడు మండలంలో నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్‌లు మంగళవారం రాజీనామా చేశారు. అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన సురేష్ బాబు, రేగడ గూడూరు గ్రామానికి చెందిన లింగన్న గుంతకందాల గ్రామానికి చెందిన నాగార్జున, మోతుకూరు గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ రెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏపీవో మల్లికార్జునకు రాజీనామా పత్రాలు అందజేశారు.

వర్షపు నీరు తొలగింపు

ఆత్మకూరు, జూలై 23: ఆత్మకూరు పట్టణ శివార్లలోని ముస్లిం శ్మశాన వాటికలో మంగళవారం మున్సిపల్ సిబ్బంది వర్షపునీటి తొలగింపు చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ముస్లిం స్మశాన వాటికలో వర్షపునీరు నిలిచిపోవడంతో అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈసమస్యను టీడీపీకి చెందిన కొంతమంది నాయకులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ స్మశాన వాటికను స్వయంగా పరిశీలించి వారి సిబ్బందితో వర్షపునీటి తొలగింపు చర్యలు చేపట్టారు.

'పశువుల ఆరోగ్యం జాగ్రత్త'

పాణ్యం, జూలై 23: పశువుల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని పశుసంవర్థక శాఖ డీడీ డాక్టర్ పార్థసారథి సూచించారు. గోరుకల్లులో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పశువులలో గర్భకోశ వ్యాధులు నివారించడానికి రేషన్ బ్యాలెన్సింగ్, పశుగ్రాసాల పెంపకం చేపట్టాలని పాడి రైతులకు సూచించారు. ఈశిబిరంలో 45 పశువులకు గర్భకోశ వ్యాధులకు వైద్యం అందించారు. అనారోగ్యంతో ఉన్న పశువులకు మినరల్ మిక్సర్, విటమిన్ మందులు అందజేశారు. పాణ్యం, ప్యాపిలి, బనగానపల్లె ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ కమలాకర్, డాక్టర్ కిశోర్‌కుమార్, డాక్టర్ సకారం, పశువైద్యులు డాక్టర్ వేమసులోచన, డాక్టర్ చిన్న పుల్లయ్య, డాక్టర్ నవీన్, డాక్టర్ బాబాఫక్రుద్దీన్, సర్పంచ్ హుశేన్‌బాషా, ఎంపీటీసీ గణేష్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల్లోకి వర్షపు నీరు.. దెబ్బతిన్న పంటలు



ఆత్మకూరు పట్టణ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న పడేవాగు



పంట పొలాల్లో నిలిచిన వర్షపునీరు

ఆత్మకూరు, జూలై 23: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఆత్మకూరు ప్రాంతంలో కొద్దిరోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ప్రతిరోజు అడపాదడపా చిరుజల్లులతో కూడిన వర్షం కురిసినప్పటికీ పలు సమయాల్లో బలమైన వర్షం కురుస్తోంది. దీంతో ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాల్లోని చెరువులతో పాటు వ్యవసాయ బావుల్లో కూడా నీటినిల్వలు చేరుకున్నాయి. అలాగే పట్టణ శివార్లలోని పడేవాగులో, భవనాశి నదిలో నీటి ప్రవాహం కొనసాగింది. పలు గ్రామాల్లో పంటపొలాల్లో కూడా వర్షపునీరు నిలిచింది. అల్పపీడన వర్షాలతో పట్టణంలోని ఏకలవ్యనగర్, సాయిబాబానగర్, గరీబ్‌నగర్, ఇందిరానగర్, స్వరాజ్‌నగర్, లక్ష్మీనగర్, హుసేన్‌సానగర్, ఖుబ్రా మసీద్ ఏరియా, రహమత్‌నగర్ తదితర లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అదేవిధంగా పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదిలావుంటే నాలుగైదు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలతో పంటపొలాల్లో నీరునిల్వ ఉండి పంటలు దెబ్బతిన్నాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. నల్లమల అడవిలో కూడా అధిక వర్షాలు కురియడంతో పలు జలపాతాలు కనువిందు చేస్తున్నాయి.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?



గుంతలు పడిన లింగాపురం రోడ్డు

బండిఆత్మకూరు, జూలై 23: జి. లింగాపురం గ్రామం రోడ్డు నరకయాతనగా మారింది. నంద్యాల, ఆత్మకూరు ప్రధాన రహదారిలోని ఆంజనేయస్వామి మెట్ట వద్ద నుంచి లింగాపురం 3 కిలోమీటర్లు దూరం ఉంది. ఈ రోడ్డు అడుగడుగునా గుంతలుపడి ప్రజలు నరకయాతన పడుతున్నారు.



గుంతలమయంగా మారిన చెలిమిళ్ళ రహదారి

పాములపాడు: మండలంలోని గ్రామీణ రహదారులు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాములపాడు నుండి చెలిమిళ్ళకు వెళ్లే రహదారి పూర్తిగా పాడైపోయింది. నేషనల్ హైవే పనుల్లో భాగంగా బారీ వాహనాలు తిరగడంతో రోడ్లు గుంతల మయంగా మారాయి. దీంతో వాహనదారులు ప్రయాణం నరకప్రాయంగా మారింది.

'నిర్లక్ష్య వైఖరి విడనాడాలి'

నంద్యాల (నూనెపల్లె), జూలై 23: విద్యార్థుల పట్ల జిల్లా అధికారులు నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ యాదవ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధోనిరాజు డిమాండ్ చేశారు.జిల్లాలోని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్న జిల్లా విద్యాశాఖాధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. డీఆర్వో పద్మజకు వినతి పత్రం అందజేశారు. శీనివాసులు, విజయ్‌కుమార్, నూర్, జంబులయ్య, మధు, అజయ్ పాల్గొన్నారు.

'ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి'

నంద్యాల (నూనెపల్లె), జూలై 23: జీవో నంబర్ 1ని ఉల్లంఘిస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండీ రఫి డిమాండ్ చేశారు. మంగళవారం డీఈవో సుధాకర్‌రెడ్డికి పీడీఎస్‌యూ నాయకులు వినతి పత్రం అందజేశారు. షాహీద్, బాలాజి, సుధీర్, మనోహర్, సన్ని, తదితరులు పాల్గొన్నారు.

మా బిడ్డ ఎముకలైనా చూపించండి

- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డితో వాసంతి తల్లిదండ్రుల ఆవేదన



బైరెడ్డి ఎదుట విలపిస్తున్న వాసంతి తల్లిదండ్రులు

పగిడ్యాల, జూలై 23: తమ బిడ్డ ఎముకలైనా చూపిస్తే దహన సంస్కారాలు చేసుకుంటామని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వద్ద వాసంతి తల్లిదండ్రులు మద్దిలేటి, సుజాత కన్నీటి పర్యంతమయ్యారు. పాత ముచ్చుమర్రిలోని నిందితుల సామాజిక వర్గానికి చెందిన కొందరు రూ.లక్ష సొమ్మును సేకరించి వాసంతి కుటుంబానికి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో అందజేశారు. అయితే వారి డబ్బులు తమకు వద్దని, తమ పాపను తెచ్చివ్వమనండి అంటూ బైరెడ్డి ఎదుట విలపించారు. తమ పాప హత్యకు కారణమైన నిందితులకు సంబంధించిన వారిని గ్రామం నుంచి బహిష్కరించాలని, లేదంటే తాము ఊరు వదిలి ఎక్కడికైనా పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి బాలిక తల్లిదండ్రులకు మాట్లాడి ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం బైరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో గ్రామాన్ని కొంతమంది నాశనం చేశారని అన్నారు. గ్రామంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ రౌడీయిజాన్ని కొనసాగించడంతో పాటు యువతను గజాయికి, మద్యానికి బానిసలను చేశారని ఆయన ఆరోపించారు. బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకరవాడ వెంకటస్వామి, కట్టుబడి శ్రీనివాసనాయుడు, వెంకట కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆసుపత్రి తనిఖీ



గాజులపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న డీపీవో

మహానంది, జూలై 23: మండలంలోని గాజులపల్లి గ్రామంలో మంగళవారం డీపీవో మంజులావాణి పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రి, జడ్పీ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం పారిశుధ్యంపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం వర్షాకాలంలో కావడంతో గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా మండల స్థాయి అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్డీ శివనాగజ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్, వెల్ఫేర్ అసిస్టెంట్ లింగమయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పట్టుబడిన సారా ధ్వంసం

నందికొట్కూరు రూరల్, జూలై 23: బ్రాహ్మణకొట్కూరు పోలీస్‌స్టేషన్‌లో గతంలో పట్టుబడిన కేసులలో గల నాటు సారాను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు. మంగళవారం బ్రాహ్మకొట్కూరు పోలీసు స్టేషన్ వద్ద గతంలో స్టేషనలో 21 ఎక్సైజ్ కేసులు, 26 ఐడీ అర్రాక్ కేసులలో అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆత్మకూర్ ఎస్‌డీపీవో శ్రీనివాసరావు, రూరల్ సీఐ బీఆర్ కృష్ణయ్య, ఎస్ఐ నాగార్జున సమక్షంలో పట్టుబడిన నాటు సార బిందెలను ధ్వంసం చేశారు.

ఆధార్ సీడింగ్ పరిశీలన

బండిఆత్మకూరు, జూలై 23: బండిఆత్మకూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆధార్ సీడింగ్‌ను ఎంపీడీవో విజయరావు పరిశీలించారు. మంగళవారం 2010 నుంచి 2016 వరకు ఎలాంటి ఆధారాలు లేకుండా ఆధార్‌లు తీసిన వాటిలో చేర్పులు, మార్పుల కోసం ఈ నెల 27 వరకు సర్వేతలు చేపట్టినట్లు ఎంపీడీవో తెలిపారు.

వాసవీమాతకు వస్త్ర సమర్పణ

నంద్యాల (కల్చరల్), జూలై 23: నంద్యాల నూనెపల్లెలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీ మాతకు మంగళవారం నూనెపల్లె ఆర్యవైశ్య మహిళామండలి సంఘం ఆధ్వర్యంలో కుంకుమ, పసుపు సారె, చీరలు, పూలు, పండ్లు, గోరింటాకు, నెయిల్ పాలిష్, 108 రకాల స్వీట్లు సమర్పించారు. నూనెపల్లె ఓంకారేశ్వరస్వామి దేవస్థానం నుంచి నూనెపల్లె అమ్మవారిశాల వరకు ఆషాడమాస సార మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో నూనెపల్లి ఆర్యవైశ్య మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

'వైసీపీ హయాంలో కార్మికులకు అన్యాయం'

నందికొట్కూరు రూరల్, జూలై 23: వైసీపీ హయాంలో కార్మికులకు అన్యాయం జరిగిందని, ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రాంభించి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి, తాపీ వర్కర్స్ యూనియన్ జిల్లా మాజీ సహాయ కార్యదర్శి అబ్దుల్ మునాఫ్ కోరారు. నందికొట్కూరులో మంగళవారం ఏర్పాటు చేసిన తాపీ వర్కర్ల యూనియన్ సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను నవరత్నాల సంక్షేమ పథకాలకు మళ్లించి కార్మికులు తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. దాదాపుగా 32 వేల మంది కార్మికులు సంక్షేమ బోర్డుకు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోగా ఎవరికీ అందించలేదన్నారు. పట్టణ తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు రెహంతుల్లా, నాయకులు నూర్ అహ్మద్, అయూబ్, మహినంది, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులను నిరాశ పరిచిన బడ్జెట్'



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు

గడివేముల, జూలై 23: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశపరిచిందని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి అన్నారు. మండలంలోని గడిగరేవుల గ్రామంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పులు చేయకుండా, కొత్త పన్నుల విధానంలో మార్పులు చేయడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఈ బడ్జెట్‌లో పాత విధానంలో పన్నులు చెల్లించే వారికి రాయితీ కల్పిస్తారని భావించిన తమకు నిరాశ మిగిల్చిందని అన్నారు. కొత్త పెన్షన్ విధానానికి రాయితీలు కల్పించడంపై అసహనం వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, జిల్లా మహిళ కార్యదర్శి కవిత, సీనియర్ నాయకులు నాగన్న, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

శాకంబరిగా కొలనుభారతి అమ్మవారు

కొత్తపల్లి, జూలై 23: నల్లమలలో కొలువైన కొలనుభారతి అమ్మవారు మంగళవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆశాడమాసాన్ని పురస్కరించుకుని మంగళవారం పురోహితులు అమ్మవారికి పంచసూక్తములతో పంచామృతాభిషేకం, లలితా సహస్రనామావళి పారాయణం, సరస్వతి అష్టోత్తర అర్చనలు, తీర్థప్రసాదాలు, బీజాక్షరములు, అక్షరాభ్యాస క్రతువులు నిర్వహించారు. ప్రాతఃకాల సమయంలోనే ఈవో మోహన్ ఆధ్వర్యంలో పురోహితులు చారుగోషి నదిజలాలచే అమ్మవారిని అభిసేకించి ప్రత్యేక పూజలు, నూతన వస్త్రాలంకరణ గావించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఆర్యవైశ్య సత్ర నిర్వహకులు అన్నదానం కార్యక్రమం చేపట్టారు.



శాకబరి దేవి అలంకరణలో దర్శనమిస్తున్న కొలనుభారతి అమ్మవారు

బాలికకు వాతలు పెట్టిన ముగ్గురిపై కేసు

మిడుతూరు, జూలై 23: ఆరేళ్ల చిన్నారికి వాతలు పెట్టిన ముగ్గురు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. వివరాలివీ.. తలముడిపి గ్రామానికి చెందిన శ్యామలమ్మ కూతురు ఆరేళ్ల బాలిక మైథిలి ఈ నెల 17న స్నేహితురాళ్లతో కలిసి ఆడుకుంటూ ఉంది. పిల్లలు ఆడుకుంటున్న సమయంలో పొరిగింటి మహిళ చాకలి ఉశేనమ్మ మంచంపై ఉతికి ఆరేసిన బట్టలు కింద పడేసిందని చిన్నారి మైథిలిని తన ఇంట్లోకి తీసుకువెళ్లి వేడి చేసిన చలాకితో చిన్నారి కాళ్లకు వాతలు పెట్టింది. ఈ విషయంపై మంళవారం చిన్నారి మైథిలి తల్లి శ్యామలమ్మ ఫిర్యాదు చేశారు. చిన్నారికి వాతలు పెట్టిన ఉశేనమ్మ, ఇందుకు సహకరించిన ఆమె కూతుళ్లు రేణుక, వెంకటేశ్వరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడిపై దాడి కేసులో ముగ్గురిపై..

పాణ్యం: మండలంలోని సుగాలిమెట్ట గ్రామంలో ఈనెల 17న తేదీన గ్రామానికి చెందిన మాల్యావత్ నాగేంద్రనాయక్‌పై అదే గ్రామానికి చెందిన శంకరీబాయి, బాలాజీనాయక్, లక్ష్మీబాయి దాడి చేసి గాయపర్చిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నాగేంద్రనాయక్ ట్రాక్టరుతో వె ళ్తూండగా రహదారిపై అడ్డుగా ఉన్న జీపును తొలగించాలని కోరడంతో పక్కనున్న ఇంటికి చెందిన శంకరీబాయి దాడికి పాల్పడి కారంపొడి, రాళ్లతో గాయర్చినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్



యాళ్ళూరులో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

గోస్పాడు, జూలై 23: సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. మండలంలోని యాళ్ళూరు గ్రామంలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, తాగునీరు, టాయిలెట్లు, తదితర సదుపాయాలపై పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోజుకు ఎన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, అత్యవసర సమయాలలో ఎవరెవరు పని చేస్తున్నారని, ఏ సమయం నుంచి వైద్య సర్వీసులు అందిస్తున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరికరాల కొరత ఏమైనా ఉందా అని పలు అంశాలపై కలెక్టర్ వైద్య సిబ్బందిని అడిగారు. ఆసుపత్రిలో చిన్న పిల్లల వైద్యుడి అవసరం ఉందని, అలాగే 2000 సంవత్సరం నుంచి ఆసుపత్రి భవనం నిర్మాణంలో ఉందని, త్వరగా పూర్తి చేయాలని కోరారు. నిర్మాణంలో ఉన్న అసంపూర్తి ఆసుపత్రి భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

'శిక్ష సప్తాహ్‌ను పకడ్బందీగా నిర్వహించండి'

నంద్యాల (నూనెపల్లె): దేశ వ్యాప్తంగా విద్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. మంగళవారం నంద్యాల బొమ్మల సత్రంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులందరూ ఆగస్టు 1 నుంచి తప్పనిసరిగా యూనిఫాం ధరించేలా చర్యలు తీసుకోవాలని డీఈవో సుధాకరరెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లలిత, ఎంఈవో బ్రహ్మం ఉన్నారు.

'బాధ్యతగా మొక్కలు పెంచాలి'



ఆసుపత్రిలో మొక్కలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

బండిఆత్మకూరు, జూలై 23: నాటిన ప్రతి మొక్క పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత ఏడాది ఆగస్టులో ఇనిస్టిట్యూషనల్ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలను పీడీ పరిశీలించారు. ఆసుపత్రి సిబ్బంది సైతం మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ఆరోగ్యమే ప్రధానమని, రోగులకు మంచి ఆరోగ్యకరమైన వాతావరణం అందాలంటే చెట్లు బాగా ఉండాలని అన్నారు. డాక్టర్ భావన, ఏపీవో వసుధ, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీఈవోలు

ఆత్మకూరు/ఆత్మకూరు రూరల్ జూలై 23: ఆత్మకూరు వ్యవసాయ కార్యాలయంలో ఎంపీఈవోగా పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన సావిత్రీబాయి కుటుంబానికి ఎంపీఈవోలు తమవంతు సాయాన్ని అందజేశారు. ఆత్మకూరు మండలంలో ఎంపీఈవోలుగా పనిచేస్తున్న రవిగౌడ్, శంకర్‌నాయక్, ఇమ్రాన్‌లు జిల్లాలోని సహచర ఎంపీఈవోలను సంప్రదించి బాధిత కుటుంబానికి మంగళవారం రూ.95వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ



పైపులైన్ లీకేజీని చూపిస్తున్న ప్రజలు

జూపాడుబంగ్లా, జూలై 23: జూపాడుబంగ్లా గ్రామంలోని కర్నూలు గుంటూరు రహదారిపై తాగునీటిపైపు లీకేజీ అవుతోంది. వారంరోజుల నుంచి లీకేజీ అవుతుందని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గొల్లపేట కాలనీకి వెళ్లే రహదారి వద్ద లీకేజీ కావడమేకాకుండా నీళ్లన్నీ కలుషితం అవుతున్నాయని స్థానికులు అంటున్నారు. లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

సభను నామమాత్రంగా ముగించారు



కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉపాధి పనులపై బహిరంగ విచారణ చేపట్టిన జిల్లా అధికారులు

కొత్తపల్లి, జూలై 23: కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో జవహర్ బాబు ఆధ్వర్యంలో 17వ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ బహిరంగ సభ ను మంగళవారం నామమాత్రంగా ముగించారు. నిమండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై గత పది రోజులుగా ఎస్ఆర్‌పీ మూరద్ ఆధ్వర్యంలో 12 మంది సీఆర్పీలు క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీ చేపట్టారు. వీటిపై జిల్లా ఎన్ఆర్ఈజీఎస్ పీడీ రామచంద్రారెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి బాలాజి నాయక్, ఏపీడీ అన్వరాభేగం సమక్షంలో సీఆర్పీలు గ్రామాల వారీగా చేసిన పనుల గురించి వివరించారు. మండలంలో ఏడాది కాలంగా రూ.9 కోట్లకు పైగా వివిధ శాఖలకు చెందిన పనులు చేపట్టారు. రూ.2.2 లక్షలకుపైగా అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తించారు. అయితే భారీ మొత్తంలో అవినీతి జరిగినప్పటికీ రికవరీ మాత్రం తక్కువగా చూపించారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. 12 గ్రామ పంచాయతీలలో జరిగిన పనులపై చేపట్టిన విచారణ కేవలం 2 గంటలలోపే జిల్లా అధికారులు ముగించి వెళ్లిపోవడంతో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. జడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, ఏపీవో రేష్మా, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ శ్రీనివాసులు, పీఆర్ ఏఈ రాఘవేంద్రప్రసాద్, సర్పంచులు విజయకుమార్, చంద్రశేఖర్ యాదవ్, జమీలాబీ, సరస్వతి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గంగఒడిలోకి...

- జలాధివాసమైన సంగమేశ్వరుడు
- క్షేతాన్ని ముంచెత్తుతున్న వరద
- 234 రోజుల పాటు భక్తులకు దర్శనం
- క్షేత్రంలో కొనసాగిన అంత్యపూజలు


ఆత్మకూరు/కొత్తపల్లి, జూలై 23: ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల శ్రీశైల జలాశయానికి భారీగా వరదనీరు వచ్చిచేరుతోంది. దీంతో శ్రీశైలం బ్యాక్‌వాటర్ ప్రదేశంలో ఉన్న సంగమేశ్వర క్షేత్రాన్ని నదీజలాలు ముంచెత్తుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నానికి గర్భాలయంలోకి వరదజలాలు ప్రవేశించి వేపదారు శివలింగాన్ని చేరాయి. ఆ తర్వాత గంట గంటకు నీటిమట్టం పెరిగి సంగమేశ్వరుడు సంపూర్ణంగా జలాధివాసమయ్యారు. వరద ఉధృతి పెరిగి సంగమేశ్వరాలయాన్ని చుట్టుముట్టి ముంచెత్తుతున్నాయి. సంగమేశ్వర క్షేత్రంలోని లలితాసంగమేశ్వర స్వామి, అమ్మవార్లు జలాధివాసం సందర్భంగా చివరి రోజు ఆలయ ప్రధాన పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ అంత్యపూజలు నిర్వహించారు. ముందుగా వేపదారు శివలింగానికి రుద్రాభిషేకం చేసి, జలాధివాస మంగళహారతిని నివేదించారు. అలాగే క్షేత్రంలో జలాధివాస హోమాలు చేసి సప్తనదీ జలాలకు వడిబియ్యం, గంగా హారతులను సమర్పించారు. సంగమేశ్వరాలయం జలాధివాసమయ్యే అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.


సంగమేశ్వరాలయాన్ని ముంచెత్తిన వరద

శ్రీశైలానికి పెరిగిన ఇన్‌ఫ్లో

శ్రీశైలం, జూలై 23: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంలో మంగళవారం భారీగా ఇన్‌ఫ్లో నమోదైంది. జూరాల జలాశయం నుంచి 1,51,790 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి 1,55,323 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 842.40 అడుగులు, జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 65.5945 టీఎంసీలుగా నమోదైంది. జలాశయం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో ఎలాంటి విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు.


సంగమేశ్వరాలయ ఆవరణలోకి చేరిన వరదనీరు


వరద జలాలకు గంగాహారతి నివేదిస్తున్న పురోహితులు

234రోజులు పూజలందుకున్న సంగమేశ్వరుడు

శ్రీశైలానికి గత ఏడాది జూలై 29వ తేదిన వరద వచ్చిచేరడంతో సంగమేశ్వరుడు జలాధివాసం అయ్యారు. ఆ తర్వాత 126 రోజుల పాటు నదీగర్భంలో ఒదిగిన సంగమేశ్వరుడు గత ఏడాది డిసెంబరు 3వ తేదిన పూర్తిగా బయల్పడి తిరిగి పూజలందుకున్నారు. అప్పటి నుంచి 234 రోజుల పాటు భక్తులచే పూజలందుకున్న సంగమేశ్వరుడు మళ్లీ జలాధివాసమవ్వడం గమనార్హం. కాగా శ్రీశైలం జలాశయం వెనకతట్టు జలాల్లో 1981లో జలాధివాసమైన సంగమేశ్వరుడు సుమారు 22ఏళ్ల పాటు నదీగర్భంలోనే ఉండి ఆ తర్వాత 2003లో తొలిసారిగా నదీజలాల నుంచి బయల్పడ్డాడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి శ్రీశైలఖండం స్కందపురాణంలోని సంగమేశ్వర మహత్యంలో చెప్పబడిన విధంగా సంగమేశ్వరుడు ప్రతిఏటా కొద్దినెలల పాటు జలాధివాసమై ఆ తర్వాత తిరిగి పూజలందుకోవడం పరిపాటిగా వస్తోంది. సంగమేశ్వరాలయం జలాధివాసం కావడంతో ఎగువ ఉమామహేశ్వరాలయంలో పూజలు జరగనున్నాయి.


జలాధివాసం అవుతున్న సంగమేశ్వరుడు

చంద్రబాబుతోనే అభివృద్ధి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుసేన్



నంద్యాల (నూనెపల్లె), జూలై 23: రాష్ట్రం అన్ని విధాలుగా పరుగులు తీయాలంటే అది సీఎం చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుసేన్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో రాష్ట్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. వైసీపీ పాలనతో రాష్ట్రం 20 ఏళ్ళు వెనుకబడి పోయిందన్నారు. రాష్ట్రం పునర్నిర్మాణం, ప్రజల సంక్షేమం, యువత భవిష్యత్తు కోసం సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం, రాయలసీమ అభివృద్ధికి కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు రాబట్టడంలో టీడీపీ విజయం సాధించిందన్నారు. రాష్ట్రంలో రాజకీయ కుల మత ప్రాంతీయ విభేదాలు లేకుండా అన్ని కలుపుకుని అభివృద్ధి చేసే విధంగా చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు.

రాష్ట్రానికి న్యాయం జరిగింది

- తుగ్గలి నాగేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి



తుగ్గలి, జూలై 23: కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో న్యాయం జరిగిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్ విడుదలపై ఆయన స్పందించారు. ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఇకపై రాష్ట్రం పరుగులు తీస్తుందన్నారు. పలుమార్లు రాష్ట్ర సమస్యలను ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లి నిధులు రాబట్టడంలో చంద్రబాబు పాత్ర అమోఘమన్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిని దూరం చేసిన వైసీపీ ప్రభుత్వానికి ఇదొక చెంప పెట్టులాగా మారిందన్నారు. రాజధానికి నిర్మాణానికి రూ. రూ.15వేల కోట్లు విడుదలపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని తుగ్గలి నాగేంద్ర పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

- డీసీసీ అధ్యక్షుడు బాబురావు



కర్నూలు(అర్బన్), జూలై 23: కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగిందేమి లేదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. బాబురావు అన్నారు. ఇదొక అంకెల గారడి బడ్జెట్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.లక్ష కోట్లు కావాలని అడిగారన్నారు. కానీ ఏపీకి రూ.12 లక్షల కోట్లు అవసరమన్నారు. బడ్జెట్‌లో కేవలం రాజధానికి నిధులు ఇస్తామని చెప్పారన్నారు. కానీ పోలవరం ప్రాజెక్టుకు ఎంతమేర నిధులు ఇస్తారన్నది స్పష్టత లేదన్నారు.

రాష్ట్రానికి ప్రాధాన్యత ఏదీ..?

సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్



కర్నూలు(కల్చరల్), జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఆశించినంత ప్రాధాన్యం దక్కలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని ఆశించే ప్రజలకు నిరాశ మిగిల్చిందని విమర్శించారు. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు నేరుగా, గ్రాంటుగా ప్రకటించకుండా వివిధ సంస్థల ద్వారా అప్పుగా ఇస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విభజన హామీల అమలు కట్టుబడి ఉంటామని చెప్పి, నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు.

శ్రీశైలంలో భారీగా మద్యం పట్టివేత

శ్రీశైలం/నంద్యాల క్రైం, జూలై 23 : శ్రీశైలం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం భారీగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు శ్రీశైలం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు తన సిబ్బంది రఘునాథుడు, బాలకృష్ణ, మహేష్, నాగవేణి తదితరులతో శ్రీశైలంలోకి వచ్చిన టీఎస్ఆర్టీసీ బస్సును బస్టాండు సమీపంలో తనిఖీ చేశారు. బస్సులో ఇద్దరు మహిళలు మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా గమనించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 248 తెలంగాణ మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మహిళలు శ్రీశైలం గ్రామానికి చెందిన రాత్లావత్ బుజ్జిబాయి, తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా ఐనోలు మండలం కొర్రతాండ గ్రామానికి చెందిన కేతావత్ శాంతిలుగా పోలీసులు గుర్తించారు. సదరు మహిళలను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.


పట్టుబడిన మద్యం బాటిళ్లతో పోలీసులు

అభివృద్ధికి సహకరించండి

ఎన్‌ఆర్‌ఐలను కోరిన టీడీపీ నేత గౌరు వెంకటరెడ్డి


గౌరు వెంకటరెడ్డిని సన్మానిస్తున్న ప్రవాసాంధ్రులు

గడివేముల, జూలై 23: ప్రవాసాంధ్రులు రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టి అభివృద్ధికి సహకరించాలని టీడీపీ సీనియర్ నాయకుడు గౌరు వెంకటరెడ్డి ఎన్‌ఆర్‌ఐలను కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఫిలడెల్ఫియా నగరంలో కర్నూలు ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ చైర్మన్, తానా బోర్డు సభ్యుడు పొట్లూరి రవి మంగళవారం నిర్వహించిన ప్రవాసాంధ్రుల సమావేశానికి గౌరు వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు ప్రాంతాన్ని మెగా ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నారన్నారు. హైదరాబాదు, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఓర్వకల్లు కీలకపాత్ర పోషించనుందని అన్నారు. ఎన్‌ఆర్‌ఐలు తమ నైపుణ్యం, పెట్టుబడులతో ముందుకు వచ్చి అభివృద్ధికి సహకరించాలని కోరారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన వారికి ఎన్డీయే ప్రభు త్వం రాయితీలు ఇస్తుందన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పాణ్యం నియోజకవర్గం అన్ని విధాలా అనువైన ప్రాంతం అన్నారు. అనంతరం గౌరు వెంకటరెడ్డిని ప్రవాసాంధ్రులు ఘనంగా సత్కరించారు.

కమిటీ ఎన్నికలకు మరో మూడు నామినేషన్లు

కర్నూలు(న్యూసిటీ), జూలై 23: నగర పాలక సంస్థ సంఘ కమిటీ సభ్యుల ఎన్నికకు సంబంధించి మంగళవారం ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు, ఒక టీడీపీ కార్పొరేటర్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. నగర పాలక కార్యాలయంలో 3వ వార్డు షేక్ పర్వీన్(టీడీపీ), 31వ వార్డు మిద్దె చిట్టెమ్మ, 50 వార్డు ఎస్టీ షేక్ అహ్మద్‌లు తమ నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, సీ3 క్లర్క్ శ్రీకాంత్ ఉన్నారు. ఇదిలా ఉండగా మొత్తం ఐదుగురు సభ్యులు ఉండే కమిటీలో ఒప్పందం ప్రకారం కర్నూలు నియోజకవర్గ నుంచి ముగ్గురు, పాణ్యం నియోజక వర్గం నుంచి ఇద్దరు చొప్పున ఏకగ్రీవం చేసుకునే పద్ధతి కొనసాగేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో లెక్క తప్పుతున్నట్లుంది. పాణ్యం నియోజకవర్గం నుంచి మిద్దె చిట్టెమ్మను బలపరుస్తూ మిగతా కార్పొరేటర్లుందరూ సిద్ధమయ్యారు. మరొకరికి అవకాశం ఉన్నా ఎవరూ ముందుకు రాకపోవడంతో కోడుమూరు నియోజకవర్గం నుంచి 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డికి అవకాశం వచ్చినట్లయింది. అయితే కర్నూలు నియోజకవర్గంలో మాత్రం ఇప్పటికే వైసీపీ నుంచి ఐదుగురు కార్పొరేటర్లు నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల స్వీకరణ ముగుస్తుంది. అనంతరం అభ్యర్థుల జాబితాను విడుదల, గురువారం నామినేషన్ల పరిశీలన జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు

నంద్యాల క్రైం, జూలై 23 : నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధుల్లో నాటుసారా స్థావరాలపై మంగళవారం పోలీసులు విస్తృతదాడులు చేశారు. ఇందులో పది లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, రెండు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి 16కేసులు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా 16 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మనాయుడిపేట గ్రామ సమీపంలో జూదం ఆడుతున్నారనే సమాచారంతో సీఐ గోపినాథ్ ఆధ్వర్యంలో దాడులు చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.12,430 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రజలు నమ్మడం లేదనే ఢిల్లీకి జగన్

నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్


మాట్లాడుతున్న నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జూలై 23: వినుకొండలో జరిగిన ఘటనపై ప్రజలు నమ్మకపోవడంతోనే మాజీ సీఎం వైఎస్ జగన్ రూటుమార్చి నిరసన పేరుతో ఢిల్లీకి వెళ్లాడని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన హుశేనాపురం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. సీఎంగా పనిచేసిన ఐదేళ్లలో రాష్ట్రానికి నిధులు రాబట్టలేకపోయిన జగన్ ఇప్పుడు ఏవేవో మాట్లాడుతున్నాడన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన 40 రోజుల్లోనే కేంద్రం నుంచి రూ.15వేల కోట్లు తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. జగన్ ప్రభుత్వంలో హత్యలు, అక్రమ కేసులు, ఇసుక మాఫియా, టీడీపీ నాయకులపై కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. దాంతో రాష్ట్ర అభివృద్ధి 30 ఏళ్లు వెనక్కు వెళ్లిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఓర్వకల్లు-బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కృషి చేస్తామని కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ పేర్కొనడం హర్షణీయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు పురపాలక మంత్రితో సమీక్ష

కర్నూలు(న్యూసిటీ), జూలై 23: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారా యణతో గురువారం పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు టౌన్‌ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ విద్యులత బుధవారం తెలిపారు. పట్టణ ప్రణాళికా విభాగం శాఖలో జరుగుతున్న పనులు, వివిధ రకాల పన్ను వసూళ్లు తదిరత అంశాలపై సమీక్షించనున్నట్లు తెలుస్తోంది. నగర పాలక సంస్థ కార్యాలయంలోని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో విజయవాడకు తరలివెళ్లారు.

వర్షాకాలంలో విద్యుత్ అంతరాయంపై జాగ్రత్త

విద్యుత్ శాఖ ఎస్ ఈ ఉమాపతి

ఆదోని, జూలై 23: వర్షాకాలం విద్యుత్ అంతరాయంపై అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ సూపరిం టెండెం ట్ ఆఫ్ ఇంజనీర్ ఉమాపతి అన్నా రు. మంగళవారం డీఈ కార్యాల యంలో విద్యుత్ వాఖ అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుం డడం వల్ల అక్కడక్కడ ఈదురు గాలులకు విద్యుత్ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. వినియోగదారులు తీగలు తెగినప్పుడు వారే మరమ్మతు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. మొండిబకాయిలపై దృష్టి సారించి 100 శాతం విద్యుత్ బకాయిలు వసూలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రాఘవులు డీఈ రాజేష్ పురుషోత్తం కాజా ఏఈలు నాగభూషణం సంతోష్ నరసన్న పాల్గొన్నారు.

నేడు శ్రావణ మాస ఉత్సవాలపై సమీక్ష

కౌతాళం, జూలై 23: ఉరుకుంద గ్రామంలోని ఈరన్న స్వామి ఆలయంలో జరిగే శ్రావణ మాసపు ఉత్సవాలపై సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ వెంకటేష్ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్వామివారి శ్రావణ మాసపు ఉత్సవాలు నెల రోజుల పాటు జరుగుతాయని అన్నారు. వీటి ఏర్పాట్లలో భాగంగా జరుగుతున్న సమీక్ష సమావేశానికి ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ముఖ్య అతిథిగా హాజరైతున్నట్లు తెలిపారు.

లారీ బోల్తా : ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్


బోల్తాపడిన లారీ నుంచి బయటకు వస్తున్న డ్రైవర్ లక్ష్మీకాంతరెడ్డి

సి. బెళగల్, జూలై 23: కర్నూలు నుంచి యూరియా లోడ్‌తో సి. బెళగల్‌కు ఏపీ 21 టి 6111 నెంబర్ గల లారీ బయల్దేరింది. ఈ లారీని డెబ్బయి ఏళ్ల లక్ష్మీకాంతరెడ్డి నడుపుతున్నాడు. సి. బెళగల్ నుంచి కర్నూలుకు వెళ్తున్న మోటార్ సైకిల్ ఎదురుగా రావడంతో దానిని తప్పించబోయి లారీ అదుపు తప్పి గోతిలో పడింది. అయితే లారీ డ్రైవర్ లక్ష్మీకాంతరెడ్డి లారీలో నుంచి ప్రాణాలతో బయటపడ్డాడు. కర్నూలు పట్టణంలోని వాసవి నగర్‌కు చెందిన లక్ష్మీకాంతరెడ్డికి 10 సంవత్సరాల క్రితం భార్య మృతి చెందింది. ఉన్న ఒక్క కుమారుడు పట్టించుకోకపోవడంతో కర్నూలు పట్టణానికి చెందిన శ్రీనివాసయాదవ్ దగ్గర లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన 40 సంవత్సరాలుగా ఇదే పనిలో ఉన్నాడు. ఎస్ఐ తిమ్మారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్‌కు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించారు. అయితే లక్ష్మీకాంతరెడ్డికి చిన్నగాయం కూడా కాకపోవడంతో అందరూ ఊపిరి పిల్చుకున్నారు.

విద్యుత్ ప్రమాదంలో ఆస్తి నష్టం

మద్దికెర, జూలై 23: మండలంలోని హంపా గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం మధ్యాహ్నం గాలికి విద్యుత్ కేవీ-11 విద్యుత్ తీగ తెగి పడి ఆస్తి నష్టం జరిగింది. హంపా గ్రామం నుంచి బొమ్మనపల్లికి విద్యుత్ సరఫరా చేసే కేవీ-11 తీగ ఎస్సీ కాలనీ సమీపంలోని ఇంటి పైన పడిపోవడంతో కాలనీలోని హుశేన్, చంద్రప్ప, మల్లేష్, రామాంజి, రవి, యోహనయ్య మరి కొంత మంది ఇండ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, వైర్లు కాలిపోయాయి. ఇండ్లలో వాళ్లు వ్యవసాయ పనులకు, పిల్లలు పాఠశాలలకు వెళ్లడంతో ప్రాణ నష్టం జరగలేదని కాలనీవాసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 23: ఎమ్మిగనూరు మండల పరిధిలోని కడివెళ్ల గ్రామానికి చెందిన లింగప్ప(38) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. లింగప్ప కుటుంబ సమస్యలతో జీవితం మీద విరక్తి చెంది తొమ్మిది రోజుల క్రితం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. లింగప్పకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు,

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

పాణ్యం, జూలై 23: మండలంలోని ఆలమూరు గ్రామంలో కౌలు రైతు ఉప్పరి నాగప్ప (65) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మంగళవారం తన కౌలు పొలంలో గడ్డి కోస్తుండగా గడ్డిలో ఉన్న విద్యుత్ తీగను కొడవలితో పొరపాటున కోయడంతో విద్యుత్‌షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపారు.

డ్వాక్రా మహిళల సొమ్ము స్వాహా!

ఇందిరాంపల్లిలో బాధితుల ఆవేదన

డోన్, జూలై 23: డోన్ మండలంలోని ఇందిరాంపల్లి గ్రామంలో డ్వాక్రా మహిళలు కట్టిన రూ.2.53 లక్షల సొమ్మును స్వాహా చేసినట్లు తెలుస్తోంది. డోన్ మండలంలోని ఇందిరాంపల్లి గ్రామానికి చెందిన పది డ్వాక్రా గ్రూపులకు శ్రీనిధి కింద పెండేకల్లు ఎస్‌బీఐ బ్యాంకులో నుంచి రుణం తీసుకున్నారు. అదే బ్యాంకు నుంచి అప్పుగా తీసుకున్న రుణాన్ని ప్రతి నెలా కంతులను గ్రామంలోని వైకేపీ బుక్ కీపర్‌కు చెల్లిస్తూ వచ్చారు. అయితే.. డ్వాక్రా మహిళలు ప్రతి నెలా చెల్లించిన సొమ్మును చెల్లించకుండా స్వాహా చేసినట్లు బాధితులు వాపోతున్నారు. ఆరు నెలలకు పైగా పొదుపు సొమ్మును రూ.2.53 లక్షల వరకు స్వాహా చేసినట్లు డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండేకల్ ఎస్‌బీఐలోని శ్రీనిధి ఖాతాలో ప్రతి నెలా కట్టాల్సిన సొమ్మును జమ చేయకుండా వైకేపీ బుక్ కీపర్ స్వాహా చేయడంతో డ్వాక్రా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెండింగ్‌లో ఉన్న కంతుల సొమ్మును చెల్లించాలని బ్యాంకు అధికారులు ఇందిరాంపల్లి డ్వాక్రా మహిళలపై ఒత్తిడి తెస్తున్నారు. అలాగే కొత్త గ్రూపులకు బ్యాంకు రుణాలకు వెళ్లినా ఇవ్వడం లేదని బాధిత డ్వాక్రా మహిళలు వాపోతున్నారు.

● స్వాహా వాస్తవమే: ఏపీఎం రామాంజనేయులు

మండలంలోని ఇందిరాంపల్లి గ్రామంలో డ్వాక్రా మహిళల సొమ్మును బుక్ కీపర్ స్వాహా చేసింది వాస్తవమేనని వైకేపీ డోన్ ఏపీఎం రామాంజనేయులు మంగళవారం తెలిపారు. శ్రీనిధి కింద తీసుకున్న రుణం సంబంధించి డ్వాక్రా మహిళలు చెల్లించిన రూ.2.53 లక్షలు బుక్ కీపర్ స్వాహా చేశారనీ, దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో అనూరాధ

చాగలమర్రి, జూలై 23: చాగలమర్రి గ్రామంలోని ఆర్సీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం మంగళవారం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో అనూరాధ పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని, నాణ్యతగల భోజనం ఇవ్వాలని సూచించారు. కోడిగుడ్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. అనంతరం ముత్యాలపాడు గ్రామంలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నళిని ప్రియదర్శిని, సునంద, సీఆర్పీ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఫరూక్ సిబ్లిని కలిసిన టీడీపీ నాయకుడు

రుద్రవరం, జూలై 23: మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూక్ సిబ్లిని మండలానికి చెందిన టీడీపీ యువ నాయకులు బచ్చు నాగేశ్వర్‌రెడ్డి మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.



ఫరూక్ సిబ్లికి మొక్క ఇస్తున్న బచ్చు నాగేశ్వర్‌రెడ్డి

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

డోన్(రూరల్), జూలై 23: పట్టణ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ, మండల కార్య దర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సుమిత్ర ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను సీపీఎం నాయకులు మంగళవారం పరామర్శించారు. ప్రిన్సిపాల్ వేధింపులతోనే సుమిత్ర ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని వారు ఆరోపించారు. వీటిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకో వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు చిన్న రెహిమాన్ పాల్గొన్నారు.

'కుష్ఠు వ్యాధి ప్రాణాంతకం కాదు'

చాగలమర్రి, జూలై 23: కుష్ఠు ప్రాణాంతకమైన వ్యాధి కాదని వైద్యుడు ఇమ్రాన్ అన్నారు. మంగళవారం చాగలమర్రిలోని ప్రభుత్వ వైద్యశాలలో కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తికి పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ కుష్ఠువ్యాధి లక్షణాలుగల వారిని గుర్తించేందుకు ఆశా వర్కర్లు, మెయిల్ వలంటీర్లతో 13 సచివాలయాల పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. 53 అనుమానిత కేసులు గుర్తించామని చెప్పారు. కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వారికి మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

డోన్(రూరల్): డోన్ మండలం కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో నిర్వహిస్తున్న కుష్ఠు వ్యాధి సర్వేను న్యూక్లిస్ మెడికల్ ఆఫీసర్ డా.తేజశ్విని తనిఖీ చేశారు. అలాగే కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రంభూపాల్, డీపీఎంవో రామచం ద్రారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, టెక్నీషియన్ కృష్ణకుమార్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కౌలు కార్డులను వినియోగించుకోవాలి : ఏవో

కొలిమిగుండ్ల, జూలై 23: గ్రామాల్లోని కౌలు రైతులు కౌలు కార్డులను వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి సూచించారు. మంగళవారం కొలిమిగుండ్ల, మీర్జాపురం గ్రామాల్లో ఏఈవో నాగరాజు, వీఏఏలు వనిత, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. 20మంది కౌలు రైతులు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీఆర్వో భార్గవి, రైతులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీమాతకు బోనాలు

కొలిమిగుండ్ల, జూలై 23: మండలంలోని కోటపాడు, అబ్దులాపురం, కొలి మిగుండ్ల తదితర గ్రామాల్లో మంగళవారం చౌడేశ్వరీమాత ఆలయాల్లో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆషాఢ మాసం, కృష్ణపక్ష విదియ పురస్కరించుకొని భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. అదే విధంగా బెలుంశింగవరం వీరబాపులమ్మ తల్లికి భక్తులు పూజలు చేశారు.

చింతలాయపల్లెలో ముగిసిన పెద్ద సరిగెత్తు

కొలిమిగుండ్ల, జూలై 23: మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో మొహర్రం వేడుకల్లో భాగంగా పెద్ద సరిగెత్తు వేడుకలు మంగళవారం ఉదయం ముగిశాయి. సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. అర్ధరాత్రి తరువాత పీర్లను మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బ్రిడ్జి నిర్మాణ పనులు



కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

బనగానపల్లె, జూలై 23: మండలంలోని యాగంటిపల్లె గ్రామం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతం చేసినట్లు టీడీపీ నాయ కుడు, ఉపసర్పంచ్ బండి మౌళీశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. బ్రిడ్జి పనులు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయాయన్నారు. మంత్రి బీసీ అసం పూర్తిగా ఉన్న బ్రిడ్జిని యుద్ధ ప్రాదిపదికన నిర్మించాలని ఆదేశించారన్నారు.

ఆశాజనకంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్

» ఏపీకి ప్రాధాన్యం పట్ల టీడీపీ శ్రేణుల హర్షం
» ముద్ర లోన్ పెంపుపై చిరు వ్యాపారులకు ఊరట

కొలిమిగుండ్ల, జూలై 23: పార్లమెంటులో మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఆశాజనకంగా ఉందన్న చర్చ సర్వత్రా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యత కల్పించడం పట్ల జిల్లా ప్రజల్లో, టీడీపీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమ వుతోంది. పేద మధ్య తరగతి ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టారని, అదే సందర్భంలో చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించారని పలువురు పేర్కొంటున్నారు. మరోవైపు పేద వర్గాలు, చిరు వ్యాపారులకు లబ్ధి చేకూరే ముద్ర లోన్ పరిధి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెంచడం పట్ల ఆయా వర్గాల వారికి ఊరట కలుగుతుందని టీడీపీ శ్రేణులతో పాటు, ఎన్డీఏ కూటమి నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ అద్భుతంగా ఉంది..



కేంద్ర బడ్జెట్ అద్భుతంగా ఉంది. కేంద్ర బడ్జెట్లో ఏపీకి ప్రాధాన్యతనివ్వడం సంతోషం. ముఖ్యంగా రాజధాని నిర్మాణం కోసం రూ.15వేల కోట్లు కేటాయించడం శుభపరిణామం. దీంతో రాజధాని నిర్మాణం చురుగ్గా సాగుతుంది.

- మూలే రామేశ్వరరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు

రాష్ట్రానికి ఎంతో ఉపయోగం



చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతుంది. కేంద్ర బడ్జెట్లో ఏపీకి ప్రాధాన్యత సీఎం చంద్రబాబు వల్లనే సాధ్యమైంది. సామాన్య మధ్య తరగతి ప్రజలకు మేలు చేసే బడ్జెట్ ఇది.

- నంద్యాల రామేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

ప్రజలకు మేలు చేస్తుంది



ముద్ర లోన్ పరిధి పెంచడం పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఎంతో ఊరట కలిగిస్తుంది. రూ.20లక్షల వరకు ముద్ర లోన్ సౌకర్యంతో యువకులు వ్యాపారాల వైపు వెళ్లి స్వయం ఉపాధి పొందుతారు. కేంద్ర బడ్జెట్ అన్నివర్గాలకు మేలు చేసేదిగా ఉంది.

- గుజ్జల పెద్దయ్య, జనసేన పార్టీ అధ్యక్షుడు

ఘనంగా బాలగంగాధర్ తిలక్ జయంతి

డోన్(రూరల్), జూలై 23: పట్టణంలోని పాతపేట ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల గంగాధర్ తిలక్, ఆజాద్ చంద్రశేఖర్‌ల జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వారి త్యాగాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు లక్ష్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలకంగా వ్యవహరించిన బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర ఆజాద్ ఆదర్శప్రాయులను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షుడు అమీర్‌బాషా, కార్యదర్శి ఓబన్న అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని కేవీఎస్ఆర్ కళాశాలలో మంగళవారం వారి జయంతులను పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డోన్‌లో బాలగంగాధర్ తిలక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రత్యేక హోదాతోనే ఏపీకి న్యాయం: కాంగ్రెస్

డోన్(రూరల్), జూలై 23: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతోనే న్యాయం జరుగుతుందని డోన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గార్లపాటి మద్దిలేటి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో అమరా వతి అభివృద్ధి కేవలం రూ.15వేల కోట్లు బడ్జెట్ కేటాయించడం బాధాకరమన్నారు. బీహార్ రాష్ట్రానికి రూ.26వేల కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించారని, ఏపీకి ఇంత తక్కువ బడ్జెట్ కేటాయించడం తగదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జనార్దన్ యాదవ్, సుబ్బు యాదవ్ పాల్గొన్నారు.

ఏపీకి బడ్జెట్‌లో వరాల జల్లుపై హర్షం

డోన్(రూరల్), జూలై 23: ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్‌లో వరాల వర్షం కురిపించడంపై డోన్ జనసేన నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు కేటా యించడం, పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడానికి సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు.

దివ్యాంగులకు మొండిచేయి

కోవెలకుంట్ల, జూలై 23: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌లో దివ్యాంగులకు మొండిచేయి ఎదురైందని నంద్యాల జిల్లా దివ్యాంగుల జేఏసీ నాయకులు అంగనం దేవరాజ్ తన ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈసారి దివ్యాంగుల వార్షిక బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయిస్తుందని రాష్ట్రంలోనే కాక దేశంలో కూడా దివ్యాంగులు ఎదురు చూశారని అన్నారు. అయితే ఈ సారి దివ్యాంగులకు మొండిచేయి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు.

అమరావతికి రూ.15వేల కోట్ల కేటాయింపు హర్షణీయం

బనగానపల్లె, జూలై 23 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో రూ.15వేల కోట్లు విడుదల చేయడం హర్షణీయమని ఇది సీఎం చంద్రబాబు కృషి ఫలితమేనని జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో మాట్లాడుతూ ఏపీకి పూర్వోదయ పథకం కింద ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని, పోలవరం ప్రాజెక్టును త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇవ్వడం హర్షణీయమన్నారు. లాయర్ నాగేంద్రారెడ్డి, ఖాదర్, శ్రీరాములు బాలకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టంగుటూరు శీనయ్య

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే అఖిలప్రియ

నంద్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ, ఆమె తమ్ముడు, టీడీపీ నాయకుడు భూమా విఖ్యాత్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ సమస్యలపై ఆమె మంత్రితో చర్చించారు.



లోకేశ్‌తో ఎమ్మెల్యే అఖిలప్రియ

మెరుగైన వైద్య సేవలందించండి



ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డాక్టర్ జఫ్రుల్లా

కోవెలకుంట్ల, జూలై 23 : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటరు ఫర్ హాస్పిటల్ సర్వీసెస్ అధికారి డాక్టర్ జఫ్రుల్లా అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే రోగులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు.

యువతులకు టైలరింగ్‌పై శిక్షణ

బనగానపల్లె, జూలై 23: యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో మహిళలకు టైలరింగ్, డిజైన్ బ్లవుజ్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీపై ఉచితం గా శిక్షణ ఇస్తున్నట్లు యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్ ధన లక్ష్మి మంగళవారం తెలిపారు. ఆసక్తిగల మహిళలు ఈనెల 31లోగా 8441192765 నంబరుకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేయించు కోవాలని కోరారు.

అతిసార నియంత్రణపై అవగాహన

చాగలమర్రి, జూలై 23: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వైద్యులు సుల్తాన ఆధ్వర్యంలో అతిసార నియంత్రణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు కలుషితం కావడం వల్ల అతిసార వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. సీజన్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో చంద్రకళ, హెచ్‌ఏ మనోహర్, ఏఎన్‌ఎం వేదమని, అంగన్‌వాడీ వర్కర్ శోభారాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శాకంబరిగా సుంకులమ్మ

బేతంచెర్ల, జూలై 23: పట్టణంలోని గౌరిపేటలో ఉన్న గ్రామ దేవత సుంకులమ్మను మంగళవారం శాకంబరిగా అలంకరించారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని సుంకులమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించి మంగళహారతులు ఇచ్చారు.

మెగా డీఎస్సీని రెండువిధాలుగా నిర్వహించాలి

బేతంచెర్ల, జూలై 23: ప్రభుత్వం మెగా డీఎస్సీని ఆఫ్‌లైన్‌లో, లైన్‌లైన్‌లో నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజాంబేగ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎస్టీయూ బేతంచెర్ల ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో అజాంబేగ్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్ష నిర్వహణలోని అస్తవ్యస్త విధానాలను సవరించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో నిర్వహించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి: సీఐ

బనగానపల్లె, జూలై 23: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని బనగానపల్లె సీఐ గంటాసుబ్బారావు పిలుపునిచ్చారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని ఎస్వీ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లో పిల్లలు- సామాజిక భద్రత అన్న అంశంపై విద్యార్థులకు సీఐ అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ పొగ తాగడం, గుట్కా, మద్యం సేవించడం, గంజా యికి బానిసలు కావడం వల్ల తీవ్రంగా నష్టాలు కలుగుతాయని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ మునిస్వామిరెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు



డ్రైనేజీలో ప్లాస్టిక్ బాటిళ్లు

రుద్రవరం, జూలై 23: రుద్రవరంలో డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దుర్వాసనను భరించలేకపోతున్నామని, రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా తాగునీటి పైపులైను ఉన్న చోటనే మురుగు నిల్వ ఉండడతో మరింత భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ కార్యాలయానికి వెళ్లే దారిలో మురుగు కాలువ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లతో నిండి ఉంది. దోమలకు నిలయంగా మారడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పలువురు హోటల్ నిర్వాహకులు వ్యర్థాలను కాలువలోనే వేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

తూకాల్లో మోసం చేస్తే కఠిన చర్యలు



ఎలక్ట్రికల్ కాటాలను తనిఖీ చేస్తున్న ఇన్స్‌పెక్టర్ ఖాజా హుశేన్

బేతంచెర్ల, జూలై 23: పట్టణంలోని హోల్‌సేల్ దుకాణాల్లో ప్రజలను తూకాల్లో మోసం చేస్తే దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తప్పవని తూనికల కొలతల శాఖ ఇన్స్‌పెక్టర్ ఖాజా హుశేన్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని హోల్‌సేల్, పలు దుకాణాలను అకస్మికంగా సందర్శించి తూకాల కాటాలను తనిఖీలు చేశారు. అక్రమాలకు, అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని 41 ప్రభుత్వ చౌక దుకాణాల ఎలక్ట్రానిక్ కాటాలను పరిశీలించారు.ఈ తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ హనుమాన్ సింగ్, కాటాల రిపేర్ల సిబ్బంది శ్రీనివాసులు, మనోహర్, డీలర్లు పాల్గొన్నారు.

పార్వతీదేవికి వస్త్ర సమర్పణ

చాగలమర్రి, జూలై 23: చాగలమర్రి గ్రామంలోని కోదండ రామాలయంలో ఆషాడమాసం సందర్భంగా మంగళవారం ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో పార్వతీదేవికి చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలతో పార్వతీదేవిని శాకంబరి అలంకారంలో కొలువుదీర్చారు. ప్రత్యేక హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

'అర్హులందరికీ సంక్షేమ పథకాలు'

దొర్నిపాడు, జూలై 23: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే టీడీపీ లక్ష్యమని తెలుగు రైతు నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు అధ్యక్షుడు సిద్ధి సత్యం అన్నారు. మంగళవారం విజయవాడలో రోడ్డు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌ను కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తాళ్లూరు నాయుడు ఉన్నారు.

'ఆర్థిక వేధింపులకు గురి చేశారు..'

బేతంచెర్ల, జూలై 23: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బేతంచెర్ల టీడీపీ నాయకుల గనులకు భారీగా జరిమానాలు విధించి వైసీపీ నాయకులు ఆర్థిక వేధింపులకు గురి చేశారని బేతంచెర్ల టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, తిరుమలేష్ చౌదరి రాష్ట్ర జనరల్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు వినతి పత్రం అందజేశారు. మంగళవారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో మంగళగిరిలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కొల్లు రవీంద్రకు వినతి పత్రం అందజేశారు.

జనసేన సభ్యత్వ నమోదు

చాగలమర్రి, జూలై 23: చాగలమర్రి గ్రామంలో జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు కె.అబ్దుల్లా, జి.సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన సభ్యత్వ నమోదు పొందిన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై హర్షం ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు షబ్బీర్, లింగారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


కోటపాడులో జూదరుల అరెస్ట్

కొలిమిగుండ్ల, జూలై 23: మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ గోపినాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గ్రామ సమీపంలోని తాగునీటి ట్యాంకు వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సిబ్బందితో కలిసి దాడి చేయగా ఐదుగురు నిందితులతోపాటు, రూ.6,900 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

రుద్రవరం, జూలై 23: నంద్యాల సమీపంలోని కొండాపురం గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి(25)కి ఆర్.నాగలవరం గ్రామానికి చెందిన బాలమునెయ్యతో పదేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అయితే శ్రీలక్ష్మి సోమవారం ఆర్.నాగలవరంలోని ఇంట్లోని బాత్‌రూములో ఉరివేసుకుని ఉన్నారు. తన కుమార్తె మృతికి తన అల్లుడు కారణమని శ్రీలక్ష్మి తల్లి ఎన్.లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలమునెయ్యపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ బాలన్న తెలిపారు.

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



కుష్ఠు వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్యాపిలి, జూలై 23: కుష్ఠు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కుష్ఠు వ్యాధి వైద్యనిపుణురాలు తేజస్విని అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఆమె కుష్ఠు వ్యాధి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేకపోయినా, గోధుమ మచ్చలు ఏర్పడినా, వేళ్లు మొద్దుబారినా కుష్ఠు వ్యాధిగా గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి రామచంద్రారెడ్డి, రాఘవేంద్రగౌడు, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

'రక్తహీనతకు గురైన పిల్లలను గుర్తించాలి'

శిరివెళ్ల, జూలై 23: రక్తహీనతకు గురైన పిల్లలను గుర్తించి పునరావాస కేంద్రాలకు రెఫర్ చేయాలని జిల్లా బాల స్వాస్థ్య కార్యక్రమం ఇన్‌చార్జి నోడల్ అధికారి డాక్టర్ కాంతానాయక్ అన్నారు. శిరివెళ్లలోని ప్రభుత్వ మెయిన్ పాఠశాల, మోడల్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురవకుండా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామ్మోహన్‌రెడ్డి, పీహెచ్ఎన్ సరస్వతి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చిన్నారులను పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ డాక్టర్ కాంతానాయక్

ఆధార్ స్పెషల్ క్యాంపును వినియోగించుకోండి

కోవెలకుంట్ల, జూలై 23: మండలంలోని వివిధ సచివాలయాల్లో నిర్వహించే ఆధార్ స్పెషల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్డీ రాధికారెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 23 నుండి 27 వరకు ఆధార్ స్పెషల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా 23న రేవనూరు, గుల్లదుర్తి, 24న చిన్నకొప్పెర్ల, కోవెలకుంట్ల-2, 25న బిజినవేముల, కోవెలకుంట్ల 3, 26న చౌదరదిన్నె, కోవెలకుంట్ల -4, 27న భీమునిపాడు, కోవెలకుంట్ల-5 సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కౌలు కార్డులు తప్పనిసరి

కోవెలకుంట్ల, జూలై 23 : భూములు కౌలుకు తీసుకున్న రైతులకు కౌలు కార్డు తప్పనిసరిగా పొందాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. మంగళవారం ఆయన కోవెలకుంట్లలో వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కౌలుకు తీసుకున్న కౌలు రైతులు, భూ యజమానులకు ఒప్పించి కౌలు కార్డులు పొందాలన్నారు. కౌలు కార్డు పొందినప్పుడే ప్రభుత్వం నుండి వచ్చే సబ్సిడీ విత్తనాలు, రుణాలు పొందేందుకు వీలవుతుందన్నారు. అంతేకాక పంట నష్టం సంభవించినా, పండిన పంటలు అమ్ముకోవాలన్నా కౌలుకార్డు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డులు ఇచ్చేందుకు భూ యజమానులు ముందుకు రావాలన్నారు. భూ యజమానులకు ఎలాంటి నష్టం రాదని, కౌలు కార్డు కాల పరిమితి ఒక ఏడాది మాత్రమే పనిచేస్తుందని ఆ తరువాత ఉపయోగం ఉండదన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

బేతంచెర్ల, జూలై 23: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కండి అని ఎస్‌బీఐ మేనేజర్ రవితేజ అన్నారు. మంగళవారం పట్టణంలోని అమ్మవారిశాల ప్రాంగణంలో కల్కి సురేష్ ఆర్థిక సాయంతో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో నంద్యాల బ్లడ్ కేంద్రం టెక్నీషియన్లు స్వచ్ఛందంగా వచ్చిన రక్తదానం చేసిన 50 మంది యువత నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు కందగడ్డల జనార్దన్, మారం విష్ణు మోహన్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందగడ్డల మోహన్‌రావు, గౌరవాధ్యక్షులు గుండా గోపాల్, మట్ట రాజేష్, శ్రీనివాసులు, యువత పాల్గొన్నారు.

బస్సు కోసం విద్యార్థుల నిరీక్షణ



చాగలమర్రిలో బస్సు కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

చాగలమర్రి, జూలై 23: చాగలమర్రి గ్రామంలో పాఠశాల వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యాలు సరిగా లేక పోవడంతో రహదారులపై బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. పాఠశాల వదిలిన వెంటనే విద్యార్థులు మల్లేవేముల బస్టాండు, అడ్డవాగు, ఆర్టీసీ రిక్వెస్ట్ స్టేజీల వద్ద బస్సుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. విద్యార్థి బస్సులు లేక పోవడంతో బస్సుల కోసం విద్యార్థులు వేచి చూస్తూ అవస్థలు పడుతున్నారు. పాఠశాల వదిలిన సమయంలో విద్యార్థి బస్సులను ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

'గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి'



హౌసింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

దొర్నిపాడు, జూలై 23: మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగరాజు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో గృహ నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ మండలంలో 601 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 410 గృహాలు నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 191 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేసేలా చూడాలని హౌసింగ్ ఏఈ బ్రహ్మయ్యకు సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.